రేపు విశ్వకర్మ భగవానుడి యజ్ఞమహోత్సవం

హయత్‌నగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా హయత్‌నగర్ విశ్వకర్మ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్‌లోని వినాయకనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 8.30 గంటలకు విశ్వకర్మ యజ్ఞమహోత్సవం నిర్వహిస్తామని విశ్వకర్మ స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షుడు రాగిఫణి సతీష్‌చారి తెలిపారు. ఆదివారం హయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంగళవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విశ్వకర్మ భగవానుడి యజ్ఞం జరుగుతుందన్నారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలలోని విశ్వకర్మ బంధువులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో నాగరాజుచారి, కొండోజు వెంకటేశ్వర్లు, కమ్మదనం సంతోష చారి, కేశవాచారి, చేపూరి యాదగిరి చారి, ప్రవీణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ రిక్షాలనే మంజూరు చేయాలి

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): చెత్తను తరలించేందుకు రిక్షాలు కాకుండా ఎలక్ట్రిక్ రిక్షాలను మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు గణేశ మండపాల్లో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాబోయే జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కూడా ఎలక్ట్రిక్ రిక్షాలనే మంజూరు చేసేలా ప్రతిపాదించాలని సూచిస్తానన్నారు. మామూలు రిక్షాల వల్ల జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది తీవ్ర శారీరక శ్రమకు గురవుతున్నారన్నారు. ఎలక్ట్రిక్ రిక్షాలను మంజూరు చేస్తే మరిన్ని ఎక్కువ ట్రిప్పులు తిరిగే అవకాశముందని, చెత్త తరలించే పనులు వేగంగా పూర్తవుతాయన్నారు.

వేంకటేశ్వరాలయ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులు

కొత్తపేట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి వేంకటేశ్వరాలయ కమిటీ, వేంకటేశ్వర స్వామి ఛారిటబుల్ (ఎస్‌వీఎస్‌సీ) ట్రస్ట్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. నూతన చైర్మన్ ఎస్.వెంకటస్వామి ఆదివారం ఆలయంలో కమిటీ నూతన ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ నూతన వైస్‌చైర్మన్‌గా బి.బాపిరాజు, కార్యదర్శిగా కేఎ్‌ఎస్ ప్రసన్న కృష్ణ, అదనపు కార్యదర్శిగా జి.కృష్ణారావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్, కోశాధికారిగా నందికొండ లోహిత్‌రెడ్డి, ట్రస్టీలుగా ఎస్.తిరుమల రావు, హేమసుందర్‌రావు, బాలాజీ, వి.శంకర్, ఎస్.సాయిరామ్, కో- ఆప్టెడ్ ట్రస్టీగా అనంతుల సురేందర్‌రెడ్డి వ్యవహరిస్తారు. కమిటీ సలహాదారులుగా అనంతుల యాదగిరి రెడ్డి, వారణాశి వంశీని ఎంపిక చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితం

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ అన్నారు. తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ అంతర్ జిల్లా యోగాసనాల ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్ననాటి నుంచే యోగాపై ఆసక్తి, అవగాహన కల్పించాలన్నారు. నేటి యాంత్రిక జీవనంలో మనిషి ఎన్నోఒత్తుళ్లతో జీవనం సాగిస్తున్నారని అలాంటి వారికి మానసిక ప్రశాంతత కలగాలంటే యోగా ఉత్తమ మార్గమన్నారు. యోగాసనాలలో ప్రతిభ కనబర్చిన బాలలను అభినందించారు. ఏసీపీ సారంగపాణి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఉప సంచాలకుడు చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల అధికారి వెంకటేశ్వర్‌రావు, రంగారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రైస్ ఏటీఎం'కు సోషల్ ఇంపాక్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న దోసపాటి రాము, యశస్విని జొన్నలగడ్డ

మన్సూరాబాద్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చే యాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతూ ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలుస్తోన్న రైస్ ఏటీఎం, ప్రాజెక్ట్ ప్రిషా స్వచ్ఛంద సంస్థలు జేసీఐ ఇండియా జీపీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును అందుకున్నాయి. శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో రైస్ ఏటీఎం వ్యవస్థాపకుడు దోసపాటి రాము, ప్రాజెక్ట్ ప్రిషా వ్యవస్థాపకురాలు యశస్విని జొన్నలగడ్డలు జేసీఐ ఇండియా వారు ప్రకటించిన అవార్డును జేసీ సుమతీ చందా, జేసీ అరవింద్‌ల చేతుల మీదుగా అందుకున్నారు.

ప్రేమతో భగవంతుడిని ఆరాధించడమే భక్తిమార్గం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): దివ్య ప్రేమతో భగవంతుడిని ఆరాధించినటువంటి మార్గమే భక్తి మార్గమని రిటైర్డ్ ఐఏఎస్ డాకేవీ రమణాచారి అన్నారు. ఆదివారం ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తి భజన సంకీర్తన ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్తి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి హాజరై అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి మాట్లాడుతూ, ఆలయాల్లో నిర్వహించే కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్‌జీ, పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం అనుబంధ ఆలయ ధర్మాధికారి ఎంఎల్ఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వీ8 ఎట్ బాక్స్ క్రికెట్ ప్రారంభం

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): యువతలో క్రికెట్‌పై ఆసక్తి పెంచేందుకు ముసారాంబాగ్‌లో వీ8 ఎట్ బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. స్కూళ్లలో, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో క్రికెట్ ఆడుకోడానికి అనువైన స్థలం లేక యువకులు, చిన్నారులు క్రికెట్ ఆడుకోలేని పరిస్థితుల్లో నిర్వాహకులు నరేందర్, శ్యాంసుందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, యాదగిరి, రవీందర్ ఏర్పాటు చేసిన వీ8 ఎట్ బాక్స్ క్రికెట్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. బాక్స్ క్రికెట్‌లో 8మంది ఆడుకోడానికి వీలుగా నెట్‌తో పిచ్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు యాదగిరి రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ముసారాంబాగ్, గడ్డిఅన్నారం కార్పొరేటర్‌లు బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జి.సుభాష్‌చందర్, బీజేపీ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు బొక్క గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మలక్‌పేట ఇంచార్జి తీగల అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాసవీకాలనీలోని గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా దంపతులు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి



శారదానగర్‌లోని గణేశ్ యూత్ అసోసియేషన్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, కమిటీ సభ్యులు .సంతోష్, తాండవకృష్ణ, సతీష్ తదితరులు



శక్తినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అజయ్ యాదవ్ తదితరులు



గడ్డిఅన్నారం గౌడ సంఘం ఏర్పాటు చేసిన విఘ్ననాథుని దర్శించుకున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్, మైత్రి కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌గౌడ్ తదితరులు

పార్వతీ తనయుడికి ప్రణమిల్లిన భక్త జనం



బాలాపూర్ గణపయ్యను సతీమణి లక్ష్మితో కలిసి దర్శించుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



బడంగ్‌పేట్ గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్



బడంగ్‌పేట్‌లోని వినాయక మండపం వద్ద మేయర్ పారిజాతారెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న మహిళలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో ఆదివారం బాలాపూర్‌లోని బడా గణేశుడితో పాటు ఇతర ప్రాంతాల్లోని వినాయకులను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్త జనం పార్వతీ తనయుడికి ప్రణమిల్లి భక్తితో కొలుస్తున్నారు. బాలాపూర్‌లోని ప్రసిద్ధి గాంచిన ఏకదంతుడిని ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాగోపాల్‌రెడ్డి తన సతీమణి లక్ష్మీతో కలిసి దర్శించుకుని పూజలు నిర్వహించారు. మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లో గల శ్రీదత్త సాయి పీఠాధిపతి శ్రీగోపాలకృష్ణానంద స్వామీజీ కుటుంబ సభ్యులతో కలిసి బాలాపూర్ లంబోదరుడిని దర్శించుకున్నారు. కాగా, బడంగ్‌పేట్‌లో శ్రీవీరాంజనేయ భక్త సమాజం వారి బొజ్జ గణపయ్యను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ దర్శించుకున్నారు.



పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెంలోని వినాయక మండపంలో.. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి తదితరులు



బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న మీర్‌పేట్ శ్రీసాయి దత్త పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీకి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి



మానస ఎన్‌క్లేవ్ మహిళల ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



లక్ష్మీనగర్ కాలనీలో మహిళల సామూహిక హారతి



మునగనూరు రామానుజనగర్‌లోని గణపయ్యను దర్శించుకున్న కాంగ్రెస్ యువనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి



బీఎన్‌రెడ్డినగర్‌లో గణనాథుని సేవలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు



శాలివాహననగర్ విజయ హోమ్స్‌లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి



ఉప్పరిగూడ గణనాథుడిని దర్శించుకున్న కమిటీ సభ్యులు



సింగరేణి కాలనీలో పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి దంపతులు



చంపాపేట మహా గణపతిని దర్శించుకున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి

మినీట్యాంక్ బండ్‌కు క్యూ కట్టిన గణేశులు

- భక్తులతో కిటకిటలాడిన సరూర్‌నగర్ చెరువు కట్ట



భక్తులతో కిటకిటలాడుతున్నసరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మినీట్యాంక్‌బండ్‌గా పేరొందిన సరూర్‌నగర్ చెరువుకట్టలో గణనాథుని విగ్రహాలు నిమజ్జనానికి క్యూ కట్టాయి. నవరాత్రుల్లో 9వ రోజైన ఆదివారం సెలవు దినం కావడంతో నిమజ్జనాన్ని తిలకించేదుకు భక్తులు వేలాదిగా మినీట్యాంక్‌బండ్‌పైకి తరలివచ్చారు. దీంతో సరూర్‌నగర్ చెరువుకట్టతో పాటు పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్ కట్టపై తిష్టవేసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి భద్రతా చర్యలు తీసుకున్నారు. వాహనాలను సింగిల్ ఎంట్రీ...సింగిల్ ఎగ్జిట్ పద్ధతిలో కట్టపైకి అనుమతించారు. క్రేన్‌ల వద్ద తాకిడి లేకుండా ఒక విగ్రహాన్ని నిమజ్జనం చేసిన తర్వాత మరొకదాన్ని అనుమతించారు. కాగా, రాత్రి 8 గంటల వరకు సుమారు 300 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవారుజాము వరకు మరో 300 విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశాలున్నాయి. కాగా. నవరాత్రుల 3వరోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు సరూర్‌నగర్ చెరువులో 2 వేల విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

బైరాన్‌ఖాన్ చెరువు వద్ద 'నిమజ్జనానికి' సర్వం సిద్ధం

- 80 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- రేపు భారీ సంఖ్యలో తరలిరానున్న గణనాథులు



బైరాన్‌ఖాన్ చెరువు వద్ద ఉన్న నిమజ్జన ఘాట్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద బైరాన్‌ఖాన్ చెరువులో గణేశ్ నిమజ్జనం కోసం సర్వం సిద్ధం చేశారు. స్థానిక నేతలు, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. నిమజ్జన కోసం సుమారు 80 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఘాట్ చుట్టూ 10 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.

3 క్రేన్‌లతో నిమజ్జనం

బైరాన్‌ఖాన్ చెరువు ఘాట్‌కు తరలివచ్చే వినాయకులను నిమజ్జనం చేసేందుకు అధికారులు 3 క్రేన్లను ఏర్పాటు చేశారు. ఘాట్‌కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వినాయకులను తీసుకువచ్చిన వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాకుండా వెంట వెంటనే అక్కడి నుంచి పంపించి వేస్తున్నారు. మంగళవారం పెద్ద ఎత్తున వినాయకుల నిమజ్జనకు తరలివచ్చే అవకాశాలు ఉండటంతో 3 క్రేన్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం చేసిన అనంతరం చెరువులో నుంచి విగ్రహాల వ్యర్థాలను తొలగించేందుకు ట్రాక్టర్లను కూడా సిద్ధంగా ఉంచారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల శివారు గ్రామాలతో పాటు హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, లక్ష్మారెడ్డి పాలెం నుంచి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. గణపతి నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.



ఉద్యోగాలు సాధించిన వారిచే కేక్ కట్ చేయిస్తున్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం, స్వరూపారాణి, వీరబాబు


సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

- డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం అన్నారు. కొత్తపేటలోని రూప ఐఏఎస్ అకాడమీకి చెందిన 613 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని ఆదివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక ప్రాంతం ఏ విధంగానైనా అభివృద్ధి సాధించాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ప్రపంచంలో అత్యధికంగా ఇంజనీర్లు కలిగి ఉన్న దేశాలలో భారత దేశం ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇంజనీర్లే సమాజానికి అమూల్యమైన ఆస్తి అని అన్నారు. అకాడమి డైరెక్టర్ స్వరూపారాణి, ఫ్యాకల్టీ వీరబాబు, ఐక్యాడ్ డీఈ జగతి కాసీం, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ గజ్జ శ్రీరామ్, ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, స్వరూపారాణి పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

- ఎమ్మెల్యే బలాల



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే

సైదాబాద్, సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవతా విలువలను పెంపొందించే మహ్మద్ ప్రవక్త బోధనలు సమస్త మానవళికీ అనుసరణీయమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మది నం మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకొని జమాతే ఇస్లామీ మలక్‌పేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైదాబాద్ మహారాజా ఫంక్షన్ హాల్‌లో సీరత్ ఎక్స్‌పో-2024ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రవక్త జీవిత చారిత్రక ఘట్టాలు, బోధనలకు సంబంధించిన అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. 33 పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్విజ్, వక్తృత్వ పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. జమాతే ఇస్లామీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్, నగర అధ్యక్షుడు ముబషీర్, మలక్‌పేట అధ్యక్షుడు ముజీబుల్ అలా పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని
వాహనదారుల ఆందోళన

చంపాపేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో వాహనదారులు ఆదివారం కొద్దిసేపు ఆందోళనకు పూనుకున్నారు. ద్విచక్ర వాహనాల్లో పవర్ పెట్రోల్ పోయించుకొని కొద్ది దూరం వెళ్లేసరికి వాహనాలు నిలిచిపోయాయని వారు వాపోయారు. పలువురు వాహనదారులు పెట్రోల్‌లో వాటర్ కలిశాయని బాటళ్లతో అక్కడికి వచ్చారు. పెట్రోల్‌లో ఇథనాల్ కలుస్తుందని, రెండూ సరిగా కలవకపోవడంతో నీళ్లలా కనిపిస్తుందని బంక్ సూపర్‌వైజర్ చంద్రారెడ్డి వారికి వివరించారు. కంపెనీ నుంచే తమ బంక్‌కు పెట్రోల్ అలా వచ్చిందని వాహనదారులకు చెప్పడంతో వారు వెనుదిరిగారు. బంక్ యజమానిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా. హెచ్‌పీ కంపెనీ నుంచి తమ బంక్‌కు పెట్రోల్ సరఫరా జరిగిందని ఇందులో తాము ఎలాంటి అవకతవకలకు పాల్పడే అవకాశాలు లేవన్నారు. తాము కంపెనీకి సమాచారం ఇవ్వగా వెంటనే వారు బంక్‌కు వచ్చి పరిశీలించారని, బంక్‌లోని పెట్రోల్ ట్యాంకర్‌లో ఇథనాల్‌ను తొలగిస్తున్నట్లు తెలిపారు. కొందరు కావాలని దీన్ని రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

మహేష్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన నేతలు



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో వివిధ మండలాలు, కార్పొరేషన్లు, డివిజన్ల పార్టీ అధ్యక్షులు, నాయకులు తరలివెళ్లారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. -(ఎల్‌బీనగర్,ఆంధ్రజ్యోతి)

ఘనంగా గురు పూజోత్సవం



అల్మాస్‌గూడ 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో ఆదివారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కాలనీ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. (సరూర్‌నగర్-ఆంధ్రజ్యోతి)

గురువులను సన్మానించడం గొప్ప విషయం: ఎమ్మెల్సీ



గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం తదితరులు

చంపాపేట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యనేర్పిన గురువులను పూజించడం, సన్మానించుకోవడం గొప్ప విషయం అని ఎమ్మెల్సీ ప్రొ: కోదండరాం అన్నారు. చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తాలోని లక్ష్మీ కన్వెన్షన్‌లో ఆదివారం వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డా కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కోదండరాం, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమళ్ల ప్రకాష్, అడిషనల్ సూపరింటెండెంట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో పాలాధి కృష్ణమూర్తి హాజరై పలువురు గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, తరగతి గదుల్లో గురువుల బోధనలు విద్యార్థులకు ఎంతో ముఖ్యమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని కాచం సత్యనారాయణను అభినందించారు. కాచం సుష్మా, నంగునూరి రమేష్, రాంనరేష్, దయాకర్‌రావు, రావికంటి శ్రీనివాస్, డా:కృష్ణారెడ్డి, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరుగా లడ్డూ వేలం పాటలు

హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయంలో...

చంపాపేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలోని వినాయక మండపంలో ఆలయ వ్యవస్థాపకుడు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూధన్‌రెడ్డి గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుని లడ్డూ వేలంపాటలో మన్నెగూడకు చెందిన సింగారం శేఖర్‌రెడ్డి రూ. 1.20 లక్షలకు, ఆలయ ధర్మకర్త హరిపురి కాలనీకి చెందిన గుడిపాటి రవిగుప్తా స్వామివారి గర్భగుడిలోని లడ్డూను రూ.76 వేలకు, భూపేష్‌గుప్తానగర్‌కు చెందిన నారగోని శ్రీనివాస్‌యాదవ్ కలశాన్ని రూ.10,500కు దక్కించుకున్నారు. ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, రమణ గురుస్వామి, ఆలయ డైరెక్టర్లు మంగారెడ్డి, సందీప్ రెడ్డి, విజేశ్వర్‌రెడ్డి,ప్రకాష్‌గుప్తా పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో..

హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో గణపతి లడ్డూతో పాటు కలశం, హుండీకి వేలం పాట నిర్వహించారు. బాధమోని అల్వాల్‌రెడ్డి కలశంను రూ.57 వేలకు, ఖమ్మ చిన్నపురెడ్డి హుండీని రూ.30వేలకు, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి స్వామి వారి పట్టు వస్త్రాలను రూ21.1వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దోర్నాల విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కోశాధికారి, రాహుల్‌సాగర్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాగాల ఎన్‌క్లేవ్ బృందావనంలో రూ. 1.13 లక్షలు

మన్సూరాబాద్ : డివిజన్ పరిధిలోని రాగాల ఎన్‌క్లేవ్‌లోని బృందావనం అపార్ట్‌మెంట్స్ మండపంలోని లడ్డూను అపార్ట్‌మెంట్ వాసి కానుకూర్తి పద్మావతి దంపతులు రూ.1,13,456లకు కైవసం చేసుకున్నారు.

స్నేహపురి కాలనీలో రూ. 1.51 లక్షలు

కొత్తపేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలో యూత్ అసోసియేషన్ వినాయకుడి లడ్డూను నాగోల్ మాజీ కౌన్సిలర్, స్నేహపురి వేంకటేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అనంతుల యాదగిరి రెడ్డి రూ 1, 51, 116 లకు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి, ప్రతినిధులు అనంతుల లక్ష్మారెడ్డి, ప్రసాద్, బాబ్జీ, వీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్ యూత్ లడ్డూ రూ.1.93 లక్షలు

చైతన్యపురి హనుమాన్‌నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని లడ్డూని శ్రీనివాస్‌చౌదరి అనే వ్యాపారి రూ.1.93 లక్షలకు దక్కించుకున్నాడు. అదేవిధంగా స్వామివారి పట్టువస్త్రాలను కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.30వేలకు కైవసం చేసుకున్నారు.

- సైదాబాద్ ఎల్‌సీహెచ్‌కాలనీ వినాయకమండపంలో రూ.12 లక్షలకు రాఘవచారి లడ్డూను దక్కించుకున్నారు.



రాగాల ఎన్‌క్లేవ్ బృందావనంలో లడ్డూను కైవసం చేసుకున్న కానుకూర్తి పద్మావతి దంపతులు



విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో లడ్డూ గ్రహీత డాక్టర్ ప్రమోద్ దంపతులను సన్మానిస్తున్న కాలనీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి



హరిహర క్షేత్ర అయ్యప్ప గుడిలోని గణపతి మండపంలో లడ్డూ గ్రహీతలను సన్మానిస్తున్న వంగా మధుసూధన్‌రెడ్డి



శ్రీనివాస్‌చౌదరి కుటుంబ సభ్యులకు లడ్డూను అందజేస్తున్న బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి